క్లుప్తంగా

వలంటీర్ల సేవలు అభినందనీయం



మాచవరం: క్షేత్రస్థాయిలో ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థ, వలంటీర్ల సేవలు ఎంతో అభినందనీయమని జెడ్పీటీసీ జె.శివాయదవ్ అన్నారు. మండలంలోని కొత్త గణేశునిపాడు గ్రామ సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు నేరుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు వలంటీర్ వ్యవస్థ వారధిగా నిలిచిందన్నారు. వలంటీర్ల సేవలను గుర్తిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సేవారత్న, సేవామిత్ర, సేవా వజ్ర అవార్డులు ప్రకటిస్తూ, పురస్కారాలు అందించడం హర్షణీయమన్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, వైస్ ఎంపీపీ చల్లగుండ్ల లక్ష్మయ్య, గ్రామ ఇన్‌చార్జి రాంబాబు, ఎంపీడీవో సురేష్, ఈవోపీఆర్‌డీ వెంగళరావు, ఆయా గ్రామాల పెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన



దాచేపల్లి : లింగ వివక్ష చూపించటం చట్టరీత్యా నేరమని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి పి.సుచరిత అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బేటీ బచావో..బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా బాలల హక్కులు, లింగ వివక్షపై అంగన్‌వాడీ కార్యకర్తలకు, కిశోర బాలికలకు అవగాహన సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుచరిత మాట్లాడుతూ..18 సంవత్సరాల వయస్సు నిండకుండా బాలికలకు వివాహాలు చేయటం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు చేయకుండా చదివించాలన్నారు. బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వరలక్ష్మి, శ్రీలక్ష్మి, రత్నకుమారి, అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధం

వెల్దుర్తి: మండలంలోని హనుమాపురం తండాలో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు తండాకు చెందిన మండ్లి సురేష్ గుడిసె పూర్తిగా కాలి దగ్ధమైంది. లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగింది. రూ.15వేల నగదు, నిత్యావసర వస్తువులు, విలువైన డాక్యుమెంట్లు దగ్ధమయ్యాయి. ఇంట్లో ఎవరూ లేని సమయంలో షార్ట్ సర్క్యూట్ అవటంతో పెనుప్రమాదం తప్పింది. గుడిసె దగ్ధం కావటంతో కుటుంబం బజారున పడిందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వీఆర్‌వో యలమంద ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఉన్నతాధికారులకు విషయాన్ని నివేదిస్తామన్నారు.

ప్రతి కుటుంబానికి 100 రోజులు ఉపాధి పనులు చూపించాలి

ఏపీడీ సురేంద్రకుమార్

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి 100 రోజుల పనులు చూపించాలని ఉపాధి హామీ పథకం ఏపీడీ సురేంద్రకుమార్ అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2024-2025 సంవత్సరంలో ఇప్పటి వరకు రూ. 2 కోట్ల విలువైన 78 పనులను గుర్తించడం జరిగిందన్నారు. గుర్తించిన పనులకు ప్రభుత్వ అనుమతులు కచ్చితంగా పొందాలన్నారు. ఎఫ్ఏలు గ్రామాలలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పంట కాల్వలు, భూ అభివృద్ధి పనులను, నిబంధనల మేరకు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఆయా పనులకు సంబంధించిన రిజిస్టర్లలో కూలీల పేర్లు నమోదు చేసి వెంటనే తప్పనిసరిగా ఎన్ఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. మండలంలోని 11 గ్రామాలకు సంబంధించి మొత్తం 10,320 కుటుంబాలకు జాబ్ కార్డులు ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామంలో జాబ్‌కార్డు కలిగి ఉండి పని కావాలని అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పని చూపించాల్సిన బాధ్యత క్షేత్ర స్థాయిలో ఎఫ్ఏలదేనన్నారు. గ్రామాలలో జాబ్ కార్డుదారులు అడిగిన వెంటనే ఉపాధి పనులు చేపట్టేందుకు ఎఫ్ఏలు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు, ఏపీవో జయచంద్రకుమార్, ఈసీ సీహెచ్ నాగరాజు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

సత్తెనపల్లి: పెట్రోల్ పోసుకుని మహిళ ఆత్మహత్యాయత్నానికి యత్నించిన ఘటన బుధవారం పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ 29వ వార్డుకు చెందిన మస్తాన్‌వలి,రహమతున్ దంపతులు హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అప్పులు పెరగడంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. రహమతున్ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

ముత్యాలంపాడులో అభివృద్ధి పరవళ్లు

- నవరత్న పథకాల ద్వారా రూ.26 కోట్ల మేర లబ్ధి
- రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి బాటలో ముత్యాలంపాడు



నాడు-నేడు ద్వారా అభివృద్ధి చేసిన ప్రభుత్వ పాఠశాల భవనాల సముదాయం



గ్రామ సచివాలయ భవనం



రైతు భరోసా కేంద్రం భవనం



నిర్మాణంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్ నూతన భవనాలు



గ్రామంలో నిర్మించిన గోడౌన్

దాచేపల్లి : వ్యవసాయ ఆధారిత గ్రామమైన ముత్యాలంపాడులో అభివృద్ధి పరవళ్లు తొక్కింది. ఒక వైపు సంక్షేమ పథకాలు..మరోవైపు అభివృద్ధితో అభివృద్ధి చెందిన గ్రామాల జాబితాలో చేరింది. వైఎస్సార్‌సీపీకి అనుకూలమైన గ్రామం కావటంతో గత ప్రభుత్వంలో ఈ గ్రామాభివృద్ధిపై వివక్ష కొనసాగింది. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అభివృద్ధి అడుగులు వడివడిగా పడ్డాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో సంక్షేమ పథకాల ద్వారా రూ.26 కోట్ల మేర ప్రజలకు లబ్ధి జరిగితే... మరో రూ.12 కోట్ల మేర అభివృద్ధి పనులు గ్రామంలో వేగవంతంగా జరిగాయి. దీంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఈ గ్రామం రూపురేఖలు మారిపోయాయి.

సంక్షేమం..అభివృద్ధి ఈ గ్రామం సొంతం..

గత టీడీపీ ప్రభుత్వ పాలనలో ఈ గ్రామం పూర్తిస్థాయిలో నిరాదరణకు గురైంది. వైఎస్సార్‌సీపీని ఎక్కువగా ఆదరించటంతో కక్షగట్టిన గత పాలకులు ఒక్క అభివృద్ధి పనిని కూడా గ్రామంలో చేపట్టలేదు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఈ గ్రామాభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించి నిధులు తీసుకువచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- రూ.5 కోట్లతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాలనీల్లో పూర్తిస్థాయిలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు.
- రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.25 లక్షలతో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం భవనాలు నిర్మించారు.
- ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు రూ.90 లక్షలతో పైపులైన్ పనులు చేపట్టారు.
- రైతుల పండించిన పంటలను నిల్వ చేసేందుకు రూ.50 లక్షలతో గోడౌన్ నిర్మించారు.
- రూ.70 లక్షలతో ఓసీ, ఎస్సీ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం చేపట్టారు.
- రూ.2 కోట్ల విలువైన భూముల్లో 210 మంది నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇచ్చారు.
- రూ.50 లక్షలతో పొలంబాట పనులు చేశారు.
- రూ.1.70 కోట్లతో జిల్లా పరిషత్ హైస్కూల్ అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టి రూ.40 లక్షలతో మరో ప్రభుత్వ పాఠశాలను ఆధునీకరణ చేశారు.

చరిత్రలో నిలిచేలా సంక్షేమం, అభివృద్ధి..



ముత్యాలంపాడు గ్రామంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి చరిత్రలో నిలుస్తుంది. గత ప్రభుత్వాలు తమ గ్రామం అభివృద్ధిపై వివక్ష చూపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామంలో వెనుకబడిన కాలనీలను అభివృద్ధి చేశాం. ప్రజలకు అన్ని వసతులు కల్పించాం. మా గ్రామంలో జరిగిన అభివృద్ధి ఆదర్శంగా నిలుస్తుంది.

నెమలికొండ వెంకటచారి, సర్పంచ్, ముత్యాలంపాడు

70 ఏళ్లలో జగన్ లాంటి పాలన చూడలేదు..



నాకు ఊహ తెలిసినప్పటి నుంచి రాజకీయాలపై అవగాహన ఉంది. గతంలో ఎంతో మంది పాలకుల పరిపాలన చూశాను. నాకు ఇప్పుడు 70 ఏళ్లు. నా 70 ఏళ్ల వయస్సులో సీఎం జగన్ లాంటి పాలన ఇంత వరకు చూడలేదు. పథకాలు ఇంటికే వస్తున్నాయి. కావాల్సినంత అభివృద్ధి జరిగింది. ఇంతకంటే ప్రజలగా మేము ఏమి కోరుకుంటాం. మళ్లీ జగనే రావాలని కోరుకుంటున్నా.

మున్నంగి వెంకటేశ్వరరెడ్డి, గ్రామస్తుడు

జగనన్న అద్భుతంగా పని చేస్తున్నాడు..



అభివృద్ధి..సంక్షేమ పథకాల ద్వారా జగనన్న ఎంతో అద్భుతంగా పనిచేస్తున్నాడు. పేదల కష్టాలు తెలిసిన నాయకుడు జగనన్న. మా కాలనీల్లో రోడ్లు లేక ఇబ్బందులు పడ్డాం. జగనన్న పుణ్యంతో సిమెంట్ రోడ్లు వేశారు. మా కాలనీలన్నీ అభివృద్ధి చెందాయి. అభివృద్ధి, సంక్షేమం చేస్తున్న జగనన్నే మాకు మళ్లీ కావాలి.

పాలడుగు మరియమ్మ, గ్రామస్తురాలు

భావితరాలకు మంచినీటి అవకాశాలు అందించాలి



ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి

రెంటచింతల: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టు ఎంతో విలువైందని నీటిని వృధా చేయడంతో రానున్న రోజులలో మంచినీటి సమస్య పెరిగే అవకాశాలు ఉన్నాయని దీంతో ప్రతి నీటి బొట్టును వృధా చేయకుండా ఒడిసిపట్టేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని ప్రతి ఇంటికి సురక్షిత తాగునీటిని అందించడానికి జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా మండలంలోని పలు గ్రామాలలో ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా మండలంలో ఇప్పటికే ఫేజ్-1 కింద పాలువాయి గ్రామంలో రూ.27 లక్షలతో 700 నివాసాలకు, పశర్లపాడులో రూ.25 లక్షలతో 670 ఇళ్లకు, మల్లవరంలో రూ.17 లక్షలతో 350 గృహాలకు, పాలువాయిగేటు గ్రామంలో రూ.17 లక్షలతో 200 నివాసాలకు కుళాయిలను ఏర్పాటు చేసి సురక్షితమైన తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ఫేజ్-1 కింద మిట్టగుడిపాడు గ్రామానికి రూ.15 లక్షలు, జెట్టిపాలెం గ్రామానికి రూ.20 లక్షలు, గోలి గ్రామానికి రూ.15 లక్షలు, మంచికల్లు గ్రామానికి రూ.33 లక్షలు ఈ పథకం ద్వారా నిధులు మంజూరు కాగా పైప్‌లైన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. మిగిలిన పనులకు కమ్యూనిటీ కాంట్రాక్ట్ సిస్టమ్ ద్వారా ప్రభుత్వమే మెటీరియల్స్ కొనుగోలు చేసి సరఫరా చేస్తుందని గ్రామ జలసంఘం ద్వారా పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మిగిలిన పనులు ఏప్రిల్ 30 నాటికి పూర్తి చేయాల్సి ఉందన్నారు.

ప్రతి ఒక్కరి ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి



మందులు అందిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ముక్కంటి, ప్రజా ప్రతినిధులు

పిడుగురాళ్ల: ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే మహాభాగ్యం లాంటిదని భావించిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి తెలిపారు. పట్టణంలోని నాల్గవ సచివాలయ పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 7, 11, 12, వార్డుల ప్రజలు వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఉచితంగా వైద్య సేవలు, మందులు కూడా అందించడం జరుగుతుందన్నారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని కార్పొరేట్ ఆసుపత్రులకు పంపి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం అందించడం జరుగుతుందన్నారు. సుమారు 320 మంది వైద్య సేవలు అందుకున్నారని వైద్య సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కత్తెరపు వాసు దేవరరెడ్డి, వైద్యులు, వైద్య సిబ్బంది, సచ్చివాలయ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కొనసాగుతున్న ఎడ్ల పందేలు

- నాలుగు పళ్ల విభాగంలో ప్రథమ స్థానంలో సరిపూడి ఎడ్లు
- ఆరు పళ్ల విభాగంలో కొండబాలవారిపాలెం ఎడ్లు మొదటి స్థానం



బల పదర్శన పోటీల్లో బండ లాగుతున్న ఎద్దు

మాచవరం: మండలంలోని మోర్జంపాడు గ్రామంలో శ్రీలక్ష్మినరసింహస్వామి 68వ కల్యాణ మహోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీల్లో భాగంగా నిర్వహించిన నాలుగు పళ్ల విభాగంలో గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం సరిపూడికి చెందిన వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, మేడి కొండూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన శాఖమూరి విజయ్ పవన్‌కుమార్ కంబైన్డ్ ఎడ్లు 5000 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. దండు అప్పారావు (రామచంద్రాపురం, సత్తెనపల్లి మండలం, పల్నాడు జిల్లా) రాయుడు సుబ్బారావు (గంగపాలెం, బల్లికురవ మండలం, ప్రకాశం జిల్లా) కంబైన్డ్ ఎడ్లు 2వ స్థానంలో, కొలూరి హుస్సేన్ (కె.కొత్తపల్లి, యర్రగొండపాలెం, ప్రకాశం జిల్లా) ఎడ్లు 3వ స్థానంలో నిలిచాయి. మోదుగుల రామిరెడ్డి (పెదపరిమి, గుంటూరు), లింగా అంజయ్య చౌదరి (గురజాల), మాదనబోయిన పోతురాజుయాదవ్ (ఇక్కుర్తి) పోశం నితీష్‌రెడ్డి (మేళ్ల చెరువు, తెలంగాణ) కంబైన్డ్ జత, చిన్నపురెడ్డి పిచ్చిరెడ్డి (కలసపాడు, వైఎస్సార్ కడప జిల్లా), కడియం మణికంఠ (బయ్యవరం, క్రోసూరు) బోర్ల వీరబ్రహ్మం (రెడ్డిగూడెం, రాజుపాలెం) కంబైన్డ్ ఎడ్లు వరుస స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నాయి.

ఆరు పళ్ల విభాగంలో.. ఈ విభాగంలో నిర్వహించిన పోటీల్లో గూడవల్లి లక్ష్మీదీక్షితా చౌదరి (కొండబాలవారిపాలెం, గుంటూరు జిల్లా) ఎడ్లు 5200 అడుగుల దూరాన్ని లాగి మొదటి స్థానంలో నిలిచాయి. పమిడి అంజయ్య చౌదరి (ప్రత్తిపాడు), గూడవల్లి లక్ష్మీదీక్షితా చౌదరి కంబైన్డ్ ఎడ్లు 4800 అడుగులతో 2వ స్థానంలో, పోతిన లక్షిత్‌చౌదరి (కొండబాలవారిపాలెం, గుంటూరు జిల్లా) ఎడ్లు 4533 అడుగులతో 3వ స్థానంలో నిలిచాయి. ముంద్రు జీవ ప్రసాద్ (మతుకుమల్లి, శావల్యాపురం) కంచేటి శివ (పాకాలపాడు, సత్తెనపల్లి) కంబైన్డ్ ఎడ్లు, కొల్లూరి శ్రీనివాసరావు (శివరాంపురం, ప్రకాశం జిల్లా) మేడగం హర్షవర్ధన్ రెడ్డి (విట్లాపురం, ప్రకాశం జిల్లా) పమిడి అంజయ్య చౌదరి (ప్రత్తిపాడు), గూడవల్లి లక్ష్మీదీక్షితాచౌదరి కంబైన్డ్ ఎడ్లు, వై.జనార్ధన్ చక్రపాణి (కలసపాడు, వైఎస్సార్ కడప జిల్లా) ఎడ్లు వరుస స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నాయి.

వాహనాల తనిఖీకి సహకరించని తెలుగుదేశం వర్గీయులు



నాగార్జునసాగర్ బోర్డర్ చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఐతో వాగ్వివాదం చేస్తున్న తెలుగుదేశం నాయకుడు

విజయపురిసౌత్: మాచర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అనుచర వర్గంతో 44 ప్రైవేట్ వాహనాలలో బుధవారం తెలంగాణ రాష్ట్రంలోని మద్దిమడుగు ఆంజనేయ స్వామి దేవాలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా రాత్రి 7.30 గంటల సమయంలో నాగార్జునసాగర్ బోర్డర్ పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద విజయపురిసౌత్ ఎస్ఐ పి.వెంకటకొండారెడ్డి టీడీపీ వాహనాలను తనిఖీ చేశారు. దీంతో టీడీపీ నాయకులు మా వాహనాలను ఎందుకు తనిఖీ చేస్తున్నారని ఎస్ఐతో వాగ్వివాదానికి దిగారు. విధి నిర్వహణలో భాగంగా ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తామని ఎస్ఐ చెప్పటంతో మరో రెండు నెలల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది, మాకు సహకరించని పోలీసుల సంగతి తేలుస్తామని అన్నారు. ఎస్ఐ మొత్తం వాహనాలను తనిఖీ చేసి పంపించారు. నిత్యం ఇక్కడి బోర్డర్ పోలీస్ చెక్ పోస్ట్ మీదుగా తెలంగాణ నుంచి ఆంధ్రా వైపు వచ్చే ప్రతి వాహనాన్ని పోలీసులు తనిఖీ చేస్తారు. టీడీపీ నాయకులు అత్యుత్సాహంతో పోలీసులతో వాగ్వివాదం చేయటం విడ్డూరంగా ఉంది.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

మాచర్ల: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వెనుకబడిన మాచర్లలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలు, విద్యార్థుల ప్రశంసలు పొందుతుందని డిస్ట్రిక్ట్ గవర్నర్ బూసిరెడ్డి అన్నారు. పట్టణంలో బుధవారం గవర్నర్ విజిట్ కార్యక్రమంలో అధ్యక్షులు చిన్ని సత్యనారాయణ, జిల్లా రోటరీ క్లబ్ సభ్యులు డాక్టర్ రామకోటయ్య, పటాన్ నాగూర్‌వలి, సత్యప్రసాద్‌ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో త్వరలో రూ.30 లక్షలతో పలు సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. అదే విధంగా జెడ్పీహెచ్ఎస్‌లో ఎన్ఎంఎంఎస్‌కు అర్హత సాధించిన విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు. మాచర్లలో విశిష్ట సేవలందించిన ఉపాధ్యాయులు, మున్సిపల్, ఆర్టీసీ సిబ్బందికి సత్కారం చేశారు. అసిస్టెంట్ గవర్నర్ ఇక్కుర్తి శంకర్, కృష్ణకుమారి, సురేఖ, డాక్టర్ మురహరిరావు, శ్రీనివాస్, వాసు, నాగేశ్వరరావు ఉన్నారు.

మీ సేవలు అద్భుతం

- విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన సీఎం జగన్
- సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసిన సీఎం జగన్
- ప్రతిపక్షాలు సహించలేక విమర్శలు ప్రభుత్వ విప్ పీఆర్కే



వలంటీర్లను సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: రాష్ట్రంలో వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలను తీసుకొచ్చి క్షేత్రస్థాయిలో ప్రతి మనిషికి ఉత్తమ సేవలందించి అందరి మన్ననలు పొందిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భారతదేశంలోనే విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన సీఎంగా పేరుపొందారని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని మానుకొండ కల్యాణ మండపంలో మంగళవారం రాత్రి 308 మంది వలంటీర్లను సత్కరించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో నవరత్నాల సంక్షేమం, అభివృద్ధితో పాటు వివిధ పథకాలు చేపట్టి విప్లవాత్మకమైన మార్పులు సీఎం జగన్ తెచ్చారని చెప్పారు. వలంటీర్ల వ్యవస్థను ప్రతిపక్షాలు ఎంతో కించపరిచాయని, రద్దు చేస్తామని ఒక ప్రతిపక్ష నాయకుడు అనగా మరో దత్తపుత్రుడు వలంటీర్ల వల్ల మహిళలు అదృశ్యమవుతున్నారని.. ఇలా మొదటి నుంచి వలంటీర్ల వ్యవస్థపై విషం చిమ్ముతున్నారని పీఆర్కే పేర్కొన్నారు. ఇతర రాష్ట్రంలో పెయిడ్ ఆర్టిస్టులుగా ఉన్న వారు ప్రజలకు జరిగే మేలు చూడలేక విమర్శలు చేస్తున్నారన్నారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. వలంటీర్లు కరోనా సమయంలో ప్రతి కుటుంబాన్ని ఆదుకున్నది గుర్తులేదా? ఎవరి గ్రామంలో వారు ఎంతో సేవ చేస్తుంటే దానిని సహించలేక వలంటీర్ల వ్యవస్థపై విమర్శలేంటన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వీరు అధికారంలోకి రావటానికి అన్ని వర్గాలపై విషం చిమ్ముతున్నారన్నారు. వీరికి తోడు ఎల్లో మీడియా ఉందన్నారు. వీరందరినీ అధిగమించి మరోసారి సీఎం జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకుంటే వలంటీర్ల వ్యవస్థతో పాటు అభివృద్ధి జరుగుతుందన్నారు. పేద వర్గాలకు సంక్షేమ పథకాలు అందించి వెలుగు నింపుతుంటే సహించలేక చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఏకమై కుట్ర రాజకీయాలతో, పొత్తులతో నీచస్థాయికి దిగారన్నారు. ఇటువంటి వారు ఈ రాష్ట్రానికి అవసరమా అన్నారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ వెంకట్ దాసు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అధ్యక్షత వహించారు. మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు అబ్దుల్ జలీల్, బోయ రఘురామిరెడ్డి, తురక కిషోర్, వివిధ వార్డుల కౌన్సిలర్లు మాట్లాడారు. అనంతరం 308 మందిని సత్కరించి అవార్డులు పీఆర్కే అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, రాష్ట్ర డైరెక్టర్లు బూదాల మరియమ్మ, కామనబోయిన కోటయ్య, పట్టణ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, మెప్మా ప్రాజెక్టు అధికారులు, సచివాలయ అడ్మిన్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్‌డీవో



పాత పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీవో రమణాకాంత్‌రెడ్డి తదితరులు

మాచవరం: మండలంలోని అన్ని గ్రామాల్లోని పోలింగ్ బూతుల్లో మౌలిక వసతులు, సదుపాయాలు, ప్రజా సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నట్లు గురజాల రెవెన్యూ డివిజన్ అధికారి రమణాకాంత్ రెడ్డి అన్నారు. మండలంలోని రేగులగడ్డ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న పోలింగ్ బూత్‌ను ఆయన బుధవారం పరిశీలించారు. ఇటీవల ఓటు వేయాలంటే రెండు కిలోమీటర్లు వెళ్లాల్సిందేనా... అనే శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైందని, జిల్లా ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు పాత గ్రామంలో ఉన్న పోలింగ్ బూత్, నూతన గ్రామంలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రేగులగడ్డ గ్రామంలో 141 పోలింగ్ బూత్ మార్పునకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని తెలిపారు. సాధారణ ఎన్నికల నిమిత్తం పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత, సౌకర్యాలు తదితర అంశాలకు సంబంధించి స్థానిక అధికారులతో చర్చించారు. ఆయన వెంట తహసీల్దారు రామకృష్ణ, డీటీ సరోజ, ఆర్ఐ కోటేశ్వరరావు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి హత్య



దాచేపల్లి : గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురైన ఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. దాచేపల్లి మండలం పొందుగల గ్రామ పరిధిలోని ఆర్టీఏ చెక్‌పోస్ట్ సమీపంలో సుమారు 42 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి మృతదేహం ఉన్నట్లుగా పొందుగల వీఆర్వో బుధవారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ దాసరి శివనాగరాజు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి శరీరం, తలపై బలంగా కొట్టి హత్య చేసినట్లుగా ఆధారాలు గుర్తించారు. మృతుడు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. హత్య ఎవరు చేసి ఉంటారనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

